క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

మక్తల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రీ సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వాటర్ ప్లాంట్ యాజమాన్యం కిరణ్, బాబు, మారుతి, నరేష్, శివరాజ్, గోపాల్, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మునిరంగస్వామి ఉత్సవాలు

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నంలో మునిరంగస్వామి ఉత్సవాలను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, ఆభరణాలు అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బారీకేడ్ల తొలగింపు సరికాదు

మరికల్: మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన బారీకేడ్లను తొలగించడం సరికాదని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి హరీష్ అన్నారు. పాత బస్టాండ్ దగ్గర తొలగించిన బారీకేడ్లను ఆయన శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. కొందరు వ్యాపారస్తులు తమ దుకాణాలకు అడ్డుగా ఉన్నాయని రాత్రికి రాత్రే వాటిని తొలగిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికే జాతీయ రహదారికి ఇరువైపులా దాదాపు 20 వరకు బారీకేడ్లను తొలగించి వాటిని కనబడకుండా దాచారని అన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు సైతం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల నడక దారి కోసం రక్షణగా ఏర్పాటు చేసిన బారీకేడ్లను తొలగించిన వారిపై సంబంధిత అధికారులు స్పందించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



అమరచింత: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని పీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్‌గౌడ్, నారాయణ పేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర నాయకులు ప్రశాంత్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంజనేయులు మృతి చెందడంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ.. పార్టీ ఎదుగుదల కోసం కృషి చేసిన ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈమేరకు వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆయూబ్ ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, గంగాధర్ గౌడ్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

మురుగు నిల్వతో ఇబ్బందులు

అమరచింత: పట్టణంలోని పదో వార్డులో గల జీఎస్ నగర్‌లోని కందకంలో మురుగు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలోని ఇళ్ల నుంచి వస్తున్న మురుగు కోసం ప్రత్యేకమైన కాల్వలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు మురుగు కందకంలోకి వదులుతుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. నిత్యం ఈగలు, దోమలతో సావాసం చేస్తున్న పరిస్థితులు దాపరించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల సంచారం సైతం విపరీతంగా ఉండటంతో విష జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగును తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నెల రోజులుగా అంధకారంలో

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అంధకారంలో మగ్గుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నెల రోజుల నుంచి బస్టాండ్‌లో రాత్రి పూట కరెంటు సౌకర్యం లేక విద్యుత్ బల్బులు వెలగడం లేదు. దీంతో సాయంత్రం ఏడు గంటలకే బస్టాండ్ పరిసరాలు చీకటితో అలుముకుంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వస్తున్న ప్రయాణికులు చీకటిగా ఉన్న బస్టాండ్‌లో నిలవలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు దాపరించాయి. అంధకారంలో ఉండటంతో చీకట్లో బస్టాండ్‌లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతుందని సమీప కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. వనపర్తి డిపో మేనేజర్ బస్టాండ్‌ను సందర్శించినపుడు, బస్టాండ్ రూపురేఖలు మార్చి ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరుస్తామని ఇచ్చిన హామీ కలగానే మిగిలింది. విద్యుత్ వసతినే కల్పించలేని అధికారులు ప్రయాణికుల కోసం సౌకర్యాలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అమరచింత పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాత్రివేళలో వెలుగులు నింపాలని ప్రయాణికులతో పాటు ప్రజలు కోరుతున్నారు.

ఆగిన బీటీరోడ్డు పనులు

- ప్రయాణికులకు తప్పని పాట్లు
- మెటల్ వేసి వదిలేసిన కాంట్రాక్టర్



అసంపూర్తిగా నిలిచిపోయిన ఆలంపల్లి రోడ్డు

కృష్ణా: మండలంలోని ఆలంపల్లి గేట్ నుంచి చేగుంట గేట్ వరకు నిర్మిస్తున్న నూతన బీటీరోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కాంట్రాక్టర్ మెటల్ వేసి వదిలేశాడు. ఆరునెలలుగా పనులు సాగడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి ఇప్పటికీ పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ దారిలో ప్రయాణించడానికి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెటల్ వేసి వదిలివేయడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. నత్తనడకన సాగుతున్నాయి. ఆలంపల్లికి బీటీ రోడ్డు లేకపోవడంతో గ్రామప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నియోజకవర్గంలో మొదటగా ఈ గ్రామానికి బీటి రోడ్డు వేయించడానికి చర్యలు తీసుకున్నారు. మొత్తం 5.25 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3.20 కోట్లు మంజూరు చేయించారు. దీంతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆరు నెలలుగా పనులు ఆగిపోయాయి. బీటీరోడ్డు పూర్తి చేస్తే చేగుంట, ఐనాపూర్, ఆలంపల్లి ప్రజలకు మక్తల్ చేరుకునేందుకు దూరా భారం తగ్గుతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పూర్తిచేయించాలని కోరుతున్నారు. కాగా త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఇప్పటికే పలు మార్లు ఆదేశించారని ఆలంపల్లి సర్పంచ్ రామకృష్ణాదణి తెలిపారు. నిర్లక్ష్యం వీడాలని కోరారు.

ఇబ్బందులు పడుతున్నాం



అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పనులు పూర్తి కావడం లేదు. మెటల్ వేసి వదిలేశారు. అదికూడా నాసిరకంగా చేపట్టారు. ఆరు నెలలుగా పనులు ఆగిపోయాయి. దీంతో ఈ దారిలో ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పూర్తి చేసి సమస్య పరిష్కరించాలి.

– తిప్పన్న, ఆలంపల్లి

వెంటనే పూర్తిచేయాలి



రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. చేసిన పనులు కూడా నాసిరకంగా ఉన్నాయి. ఎక్కడా నాణ్యత పాటించలేదు. గుంతలమయంగా మారింది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేయాలి.

– నిర్మల, ఉపసర్పంచ్, ఆలంపల్లి

నెలాఖరులో పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం ఆలంపల్లి రోడ్డు పనులు 90 శాతం పూర్తి అయ్యాయి. బీటీ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇప్పటివరకు చేసిన పనులు నాణ్యతతో పూర్తిచేశారు. మెటల్ వేసిన తరువాత సీసీ పరిశీలనలో కొంత ఆలస్యం జరిగింది. ఏప్రిల్ చివర్లో పనులు ప్రారంభిస్తాం. త్వరగా పూర్తిచేయించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తాం.

– జయ చంద్రారెడ్డి, పీఆర్‌ఏఈ

'ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి

కోస్గి: బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ శ్రేణులకు భరోసా కల్పించేందుకు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కోస్గిలో వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 గ్రామాలను ఓ యూనిట్‌గా తీసుకొని ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారని అన్నారు. ఈ నెల 10న కోస్గిలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, ఎంపీపీ మధుకర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీను, బాలేష్, లక్ష్మమ్మ, బందె ప్పతోపాటు పలు గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మద్దూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక అల్‌జూబేదా మసీద్‌లో శుక్రవారం నాయకుడు రహీం సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, నర్సింహా, రమేష్‌రెడ్డి, శివరాజ్, బాల్‌రాజ్, చంద్రమోహన్, హుసేన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాల ఉట్లు



మక్తల్: జక్లేర్‌లో ఆంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా పాల ఉట్ల కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు గ్రామం నుంచి ఊరేగింపు చేపట్టారు. పాల ఉట్ల సందర్భంగా భక్తులు కోలాటం, చిన్నారులు ధాండియా నృత్యాలు, అడుగుల భజనలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బెయిల్ మంజూరుపై హర్షం

నారాయణపేట రూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కి కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ.శ్రీనివాసులు, ప్రభాకరవర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టెన్త్ పేపర్ లీకేజీ విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కక్ష పూరితంగా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిందని, దొంగలే దొంగ, దొంగ అని అరిచినట్లు ఉందన్నారు. తెలంగాణలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని, బాధ్యులకు కఠినంగా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హైదరాబాద్‌లో శనివారం నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రధాని నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. వ్యతిరేకతను చాటి చెప్పాలని, ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సహకరించాలన్నారు

బహిరంగ సభ పోస్టర్ విడుదల

మక్తల్: జిల్లా కేంద్రంలో అంబేద్కర్ జాతర సందర్భంగా ఈనెల 17న నిర్వహించనున్న బహిరంగ సభ పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు శుక్రవారం విడుదల చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మహేష్, దత్తాత్రేయ, శ్రీనివాసులు, హన్మంతు, సూర్యచంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

నారాయణపేట టౌన్ : హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు బొద్దెంపల్లి నర్సిములు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మాట్లాడారు. వీర హనుమాన్ జయంతోత్సవాల్లో భాగంగా చేపట్టిన భారీ శోభాయాత్రకు సహకరించి విజయవంతం చేయడం పట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు డా. క్యాతన్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో వైద్యుల పాత్ర కీలకం

నారాయణపేట రూరల్ : సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని, ఎంతో మందికి వారు ప్రాణదాతలుగా నిలుస్తున్నారని లయన్స్ క్లబ్ గవర్నర్ హరినారాయణబట్టడ్ అన్నారు. పట్టణంలోని సాయివిజయకాలనీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం డాక్టర్ గందె కార్తిక్, సూర్యకాంత్‌లను శాలువా, బొకెతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలోనే నెంబర్‌వన్ జనరల్ ఫిజిషియన్, డయాబెటలిస్ట్‌గా పేరు పొందిన వైద్యులు, లాభార్జన లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గందె ఉమాకాంత్, సుధాకర్‌గౌడ్, సాకేత్ బట్టడ్, అజ్మతుల్లాఖాన్, సుభాష్, చిట్టెం మాధవ రెడ్డి, గుర్నాత్‌రెడ్డి, ప్రవీణ్, రమేష్, సత్యపాల్, గాయకుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భారీ బందోబస్తు

కృష్ణా: మండలంలోని గూడెబల్లూర్ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కృష్ణా ఎస్‌ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. జాతర ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్రలలోని పలు పట్టణాలు, గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని పోలీసు సిబ్బంది వివరించారు.

నేత్రపర్వంగా చింతలరాయస్వామి రథోత్సవం



చింతలరాయుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



గురువలింగం పల్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం గుట్టపై స్వయంభుగా వెలసిన చింతలరాయస్వామి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజుల పాటు కొనసాగిన వేడుకల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయంలో స్వామివారి ఉద్దాలోత్సవం, శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, అర్చన, హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. చక్రస్నానంతో ఉత్సవాలు ముగిశాయి. వేడుకల్లో చిన్నారులు డోలు వాయించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, సిద్దప్ప, నాగిరెడ్డి, బాల్‌రెడ్డి, హన్మంతు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురువలింగంపల్లిలో

మాగనూర్: గురువలింగంపల్లిలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆంజనేయస్వామి రథోత్సవం శుక్రవారం తెల్లవారుజామున కనుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపుగా రథం వద్దకు తీసుకువచ్చారు. రథోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో అంజమ్మ, రవీందర్, సాయిబన్న, ఆంజనేయులు, గోవింద్, రాజు, భీమేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై సూచనలు

మాగనూర్: వడగళ్ల వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయ అధికారి హరిత, ఏఈఓ హరీష్ ఓ ప్రకటనలో శుక్రవారం సూచనలు చేశారు. ఆరుతడి, కూరగాయలు పండించే పొలాల్లో వర్షపునీరు బయటకు పంపించడానికి కాల్వలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వరి పంటను కోసినట్లయితే ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలని, వర్షాలు కురిసే సమయంలో రైతులు చెట్ల కింద నిల్చోవద్దన్నారు. పశువులను చెట్ల కింద నిలపవద్దని సూచించారు.

విగ్రహాల ఏర్పాటు అభినందనీయం



పోస్టర్లతో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ,తదితరులు

నర్వ: రాయికోడ్‌లో ఈ నెల 11 మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలేల విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్లను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి శుక్రవారం సంబంధిత పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుపై నిర్వాహకులను అభినందించారు. మరిన్ని చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, చుక్కా ఆశిరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు శంకర్, గోపాల్, శ్రీనివాసులు. రవి, రాము, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్ గౌడ్ మాట్లాడారు. రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులందరికీ అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. పెన్షనర్లను ఆదాయపు పన్ను చెల్లింపుల నుంచి మినహాయించి, పెండింగ్‌లో ఉన్న మూడు కరువు భత్య బకాయిలను చెల్లించాలన్నారు. ప్రతి నెల 1వ తేదీన పెన్షన్ చెల్లించాలన్నారు. చేపట్టనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, మండల కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

60 మందికి కంటి పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లికార్జున్

నారాయణపేట రూరల్ : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కంటి వైద్య నిపుణులు వై.మల్లికార్జున్ ఆధ్వర్యంలో 60మందికి పైగా ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం మల్లికార్జున్ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికి కంటి చూపు అనేది ఎంతో ముఖ్యమని అన్నారు. కళ్లను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహ శిబిరం ఏర్పాటు



నారాయణపేటలో ర్యాలీ చేపట్టిన రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ సభ్యులు

నారాయణపేట రూరల్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్‌క్లబ్ ఆఫ్ నారాయణపేట టౌన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత మధుమేహ శిబిరం నిర్వహించారు. పట్టణంలోని శ్రీసత్యనారాయణ స్వామి చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు శుక్రవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణ ప్రాంగణంలో 110మంది ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం లయన్స్‌క్లబ్ గవర్నర్ హరినారాయణబట్టడ్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. అనారోగ్యకరమైన అలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. నిత్యం యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ నరేందర్, కౌన్సిలర్ శిరీష, లయన్ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, సరాఫ్‌నాగరాజు, చెన్నారెడ్డి, సుభాష్, ఆత్మారామ్, నందుపటేల్, మధుసూధన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, తిరుమలేష్, రవికుమార్, బోయలక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు



గోటూర్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మాట్లాడుతున్న పాస్టర్ నగేష్

నారాయణపేట రూరల్ : గుడ్ ఫ్రైడే వేడుకలను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సింగారం, బైరంకొండ, కొల్లంపల్లి గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ నగేష్, ఫిలిప్, దయాకర్ మాట్లాడారు. గుడ్‌ఫ్రైడే సందేశాన్ని చదివి వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో క్రైస్తవ సమాజ పెద్దలు, యువకులు మహిళలు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఆరాధన కార్యక్రమానికి స్థానిక సంఘ కాపరి పాస్టర్ పౌలు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి బ్రదర్ దేవరాజు హాజరై యేసు క్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. పెద్ద దావీదు, చిన్నరాజు తదితరులు ఉన్నారు.

బస్టాండ్లను వినియోగంలోకి తీసుకురావాలి



ముళ్ల పొదలతో దర్శనమిస్తున్న పస్పుల బస్టాండ్

మరికల్: వేసవిని దృష్టిలో ఉంచుకొని నిరుపయోగంగా మారిన పలు గ్రామీణ బస్టాండ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా గ్రామాల స్టేజీల వద్ద ఉన్న బస్టాండ్‌ల చుట్టూ ఏపుగా ముళ్ల పొదలు పెరిగిపోయాయని తొలగించాలని అంటున్నారు. చుట్టూ చెత్త చేరడం, పిచ్చిమొక్కలు పెరగడంతో ప్రయాణికులు వాటిలోకి వెళ్లేందుకు భయపడుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ఎండల్లో బస్సుల కోసం ఎదురుచూడడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. విషయం దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. వారి అవస్థలు తొలగించడం కోసం బస్టాండ్‌లను శుభ్రం చేసి వినియోగంలోకి తేవాలని అంటున్నారు.